ఉంది. ఆ మతం వారికి అక్కడ బార్ రావడం ఇష్టంలేక అతని దగ్గరకి వెళ్ళి ఇంకెక్కడైనా బార్‌ని తెరవమని కోరారు. ఆ వ్యాపారస్థుడు అందుకు ఒప్పుకోలేదు.

దాంతో ఆ మతంలోని వారంతా ఆ బార్ రాకుండా చూడమని ప్రార్థనలు చేయసాగారు. బార్‌ని తెరవడానికి ఓ రోజు ముందు పెద్ద పిడుగు పడి ఆ బార్ మొత్తం కాలిపోయింది. దాంతో ఆ వ్యాపారస్థుడు మతంవారిని తనకి నష్టపరిహారం ఇవ్వమని కోరాడు. వాళ్ళు ఆ బార్ కాలడంలో తమ బాధ్యత ఎంతమాత్రం లేదని వాదించారు. ఆ వ్యాపారస్థుడు మతం మీద కోర్టుకి వెళ్ళాడు.

ఆ కేసుని పరిశీలించిన జడ్జి ఇలా చెప్పాడు.

"వాద ప్రతివాదాలు విన్నాక ఈ కేసు తీర్పు ఎలా ఉంటుందో తెలీదు కాని, ఒకటి మాత్రం నిజం. బార్ యజమానికి ప్రార్థనల మీద నమ్మకం ఉంటే, వాటిని చేసిన మతం వారికి లేదు."

## 143. స్వయంకృతం

మోటార్ సైకిల్ మీద వెళ్తున్న తన కొడుక్కి ఏక్సిడెంటయి, అతను అక్కడికి అక్కడే మరణించాడని తెల్సిన ఓ ఎం. ఎల్. ఏకి తెలిసింది. ఆ సమయంలో తన కొడుకు తాగి ఉన్నాడని తెలియగానే ఆయన శోకంతో కూడిన కోపంతో చెప్పాడు.

"నా కొడుకు మైనర్. తక్కువ వయసు గల వాడికి ఎవరు విస్కీ అమ్మారో వాడిని నేను చంపేస్తాను."

కొద్దిసేపాగి మనసు ఉపశమనానికి అతను తన విస్కీ సీసాలుంచుకునే అలమారా తలుపు తెరిచాడు. అందులోని ఓ బాటిల్ మిస్ అయిందని గుర్తించాడు. పక్కనే ఉన్న ఓ చీటీలో తన కొడుకు చేతి వ్రాతలో ఇలా ఉంది.

డేడి,

నా మిత్రులతో పార్టీ చేసుకోడానికి నేనో బాటిల్‌ని తీసుకు వెళ్తున్నాను. నీకు కోపం రాదనుకుంటున్నాను.

నీతి: ఎవరి పాపం వారినే కాల్చేస్తుంది కాబట్టి మనం చేసే పనులని పాపరహితంగా ఉంచుకోవడం మన మంచికే.

## 144. దైవ రక్షణ

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటీష్ సైన్యంలో పనిచేసిన జాన్, జార్జ్ అనే ఇద్దరు మిత్రులు బ్రిటన్‌లోని బోల్టన్ అనే ఓ ఊరికి చెందినవారు. జాన్‌కి దైవభక్తి ఎక్కువ. దాంతో మెళ్ళో క్రాస్‌ని వేసుకునేవాడు. జేబులో కూడా ఓ క్రాస్‌ని ఉంచుకుని, మణికట్టుకి ఒకటి కట్టుకునేవాడు.

జార్జ్‌కి దైవ భక్తి లేదు. తన మిత్రుడు జాన్ ఒంటి మీదవి చూసి అతనిది మూఢభక్తి అని నవ్వుకునేవాడు. ఓ సారి జర్మన్స్ మీద డన్‌కిర్క్ అనే చోట ఇద్దరి ప్లెటూన్స్ కలిసి యుద్ధంలో పాల్గొన్నాయి. తమ దగ్గర పేలిన ఓ హేండ్ గ్రనేడ్ ముక్క వచ్చి గుండె లోకి దిగబడి జార్జ్ మరణించాడు. కాని జాన్ మాత్రం ఆ దాడిలో బ్రతికి బయటపడ్డాడు.

గ్రెనేడ్ తునక వచ్చి జాన్‌కి కూడా ఛాతీకి తాకింది కాని, అతని మెడకి వేలాడే లోహంతో చేసిన క్రాస్ అది లోపలకి వెళ్ళకుండా అడ్డుపడింది. ఆ శిలువే అతన్ని కాపాడింది.

## 145. నేర్చుకో

పూర్వం కాశీకి వెళ్ళే దారిలో నర్మదా నదీ తీరంలో ఓ చోట పెద్ద ఎత్తున కట్టె పుల్లలు అనేకం పేర్చి ఉండటం అనేకమంది బాటసారులు చూసేవారు. వాటిని దగ్గరే ఉన్న అడవి లోంచి ఏరి తెచ్చే ఓ ముసలతను కనిపించేవాడు. అంతా ఆయన్ని ఆసక్తిగా అడిగేవారు.